క్లుప్తంగా

ప్రవేశ పరీక్షకు 913 మంది హాజరు



విజయవాడ రూరల్: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలు ఆదివారం నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగాయి.6వ తరగతి ప్రవేశం, 9వ తరగతి ప్రవేశం కోసం వివిధ ప్రాంతాల నుంచి 913 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6వ తరగతి ప్రవేశం కోసం ఉత్తీర్ణులైన విద్యార్థులకు 10వ తరగతి వరకు, 9వ తరగతి ప్రవేశం కోసం ఉత్తీర్ణులైన వారు 9.10 తరగతుల వరకు కేంద్ర ప్రభుత్వమే అన్ని వసతులతో చదివిస్తోందని ఇన్విజిలేటర్లు తెలిపారు.

ఇరువురిపై కేసు

పెనమలూరు: కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన సత్తివాడ హరికృష్ణ, చోడవరానికి చెందిన వంజరపు శంకర్, కోడి పందేలు నిర్వహిస్తుండటంతో వారిపై కేసు నమోదు చేశారు.

ఈ క్రాప్ చేయించండి

గన్నవరం రూరల్: రబీ సాగు చేస్తున్న రైతులందరూ పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకోవాలని మండల హార్టికల్చర్ అధికారి ఇ.హరిచంద్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో చనుపల్లివారిగూడెం, సూరంపల్లి, గోపవరపుగూడెం, గొల్లనపల్లి గ్రామాల్లో రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారన్నారు. సాగు పంట ఏదైనా తప్పక ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఆర్బీకేల్లో హార్టికల్చర్ అసిస్టెంట్లు, వ్యవసాయ సహాయకులను కలసి ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు.

విశేష అర్చనలు

నున్న (విజయవాడ రూరల్): ధనుర్మాసం సందర్భంగా ఆదివారం నున్న గ్రామంలోని రుక్మిణీ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో మహిళలు స్వామి వారికి విశేష అర్చనలు చేశారు. అనంతరం ముత్యాలు పోసి హారతులిచ్చారు. పిమ్మట నీరాజన మంత్ర పుష్ప తీర్థప్రసాద వినియోగం జరిగింది. తిరుప్పావై వ్రతం శ్రీరంగనాథస్వామి, గోదాదేవి కల్యాణంతో ముగుస్తుందన్నారు.

పిల్లల పెంపకంపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: పిల్లల విషయంలో బాధ్యత కలిగిన తల్లిదండ్రులుగా వ్యవహరించాలని ప్రముఖ సైకాలజిస్ట్ అనుమకొండ అనంతకుమార్ అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని వాసవి కల్యాణ మండపంలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పిల్లల పెంకపంపై తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పిల్లల భవిష్యత్ ఉన్నతంగా, ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు సుబ్బారావు, గూడపాటి జయరామ చంద్రరావు, డాక్టర్ లలితా కామేశ్వరి, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా సుబ్బారావు, బెజవాడ శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ సభ్యులు నారగాని కొండలరావు, దయాల ప్రభాకరరావు, వడ్డి రాజేశ్వరరావు, జన్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వామికి విశేష పూజ

గన్నవరం రూరల్: పుష్య ఆర్క యోగం పురస్కరించుకుని ఆదివారం మండలంలోని చిక్కవరం శ్రీ హనుమత్‌పుణ్యక్షేత్రంలో శ్రీ ఉషా పద్మినీ సమేత సూర్యనారాయణ స్వామికి విశేష ఆరాధనలు, పూజలు నిర్వహించారు. ఆదివారం కావటంతో భక్తులు స్వామి వారిని విశేషంగా దర్శించారు. సూర్య ఆరాధనతో సకల శుభాలు, ఐశ్వర్యాలు కలుగుతా యని అర్చకులు భక్తులకు ఉపదేశించారు. అన్నప్రసాద వితరణ చేశారు.

నలుగురు జూదరుల అరెస్ట్

గన్నవరం: మండలంలోని గోపవరపుగూడెం శివారులో జరుగుతున్న కోడిపందేల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడిచేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ రమేష్ బాబు నేతృత్వంలో సిబ్బంది దాడిచేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.5,500 నగదు, రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు


గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున శ్రీకృష్ణస్వామి, గోదాదేవికి ప్రత్యేక అర్చనలు జరిపారు. అనంతరం స్వామివార్లకు ముత్యాల హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతులు ఇచ్చారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు, ధనుర్మాస గోష్ఠి సభ్యులు, పరిసరా ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

విజయవాడ రూరల్: 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తామని తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రభుత్వాధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేయాలని కోరారు.

భక్తుల గుండెల్లో కొలువైన బ్రదర్ జోసఫ్ తంబి

- కథోలిక పుణ్యక్షేత్రంగా పెద్దావుటపల్లి
- ఏటా తంబి వర్ధంతి
- 13, 14,15, తేదీల్లో లక్షల్లో యాత్రికుల రాక



బ్రదర్ జోసఫ్ తంబి



తంబి సమాధి

ఉంగుటూరు: భక్తుల గుండెల్లో కొలువైన బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి కథోలికులకు దక్షిణ భారత దేశంలోనే పెద్ద పండగ. బ్రదర్ జోసఫ్ తంబి జీవిత చరమాంకంలో ఉంగుటూరు మండలం పెద్దావుటపల్లిలో స్థిరపడి, తుది శ్వాస విడిచారు. జనవరి 15 తంబి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..

చరిత్ర ఇదీ..

బ్రదర్ జోసఫ్ తంబి 1883లో పాండిచ్చేరిలో శేరివముత్తు, అన్నమలై దంపతులకు జన్మించారు. ఆయనకు థైరియా అనే సోదరుడు ఉన్నాడు. తంబి చిన్నతనంలోనే తల్లి అన్నమలై చనిపోవడంతో తండ్రి రెండో వివాహం చేసుకున్నాడు. సవతి తల్లి పెట్టే బాధలు భరించలేక తంబి చిన్నతనంలోనే ఇల్లు విడిచి వెళ్లాడు. కేరళలో భక్తిప్రవృత్తి గల ఒకామె దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకుంటూ పెరిగాడు. తరువాత ఆయన కుంభకోణం మేత్రాసనంలోని ఓ కుగ్రామానికి వెళ్లాడు. అక్కడ చిన్న గుడిసె వేసుకుని జీవనం సాగించాడు. అక్కడ అందరితో కలసి మెలసి ఉంటూ సమయానుకూలంగా వారికి క్రీస్తు బోధనలు బోధించేవాడు. తనకు తెలిసిన నాటు వైద్యంతో చిన్న వ్యాధులను నయం చేసిన వైద్యుడు తంబి. అక్కడ ఇగ్నేషియస్ ఫాదర్ బాధ్యతలు తీసుకోవడంతో అక్కడ నుంచి తంబి పాండిచ్చేరి లోని మణిత్తిడల్ అనే కుగ్రామానికి చేరుకున్నాడు. అక్కడి వారంతా కొండజాతి ఆదివాసులు. వారిలో నాగరికతను పెంపొందించేందుకు తంబి కృషి చేశాడు. ఆ తరువాత 1924లో తంబి నెల్లూరు జిల్లా బిట్రగుంట చేరాడు. అక్కడ కొంత కాలం ఉన్న అనంతరం 1940లో ఆంధ్రలోని విజయవాడ ప్రాంతంలోని కేసరపల్లికి చేరుకున్నాడు. అనంతరం పెద్దావుటపల్లి చేరుకున్నాడు. తంబి పెద్దావుటపల్లిలోని ఓ చిన్న గుడిసెలో నివాసం ఉంటూ బిక్షమెత్తుకుని జీవనం కొనసాగించేవాడు. సేకరించిన డబ్బును పేదల దైనందిన జీవిత అవసరాలకు సాయం చేసేవాడు. గ్రామస్తులతో కలసి మెలసి ఉంటూ సమయానుకూలంగా క్రీస్తు బోధనలు బోధించేవారు. కాలానుగుణంగా తంబి క్రీస్తు సువిశేష బోధనలకు పెద్దావుటపల్లిలోని బోయపాటి వారి కుటుంబీకులు ఆకర్షితులయ్యారు. ఎవరికైన తను మరణించబోయే కచ్చితమైన రోజు, సమయం ముందే తెలుసుకోడమనేది చాలా అరుదైన విషయం. తంబి తన మరణాన్ని గురించి తోటివారితో, మిత్రులతో చెబుతుంటే హాస్యాస్పదంగా తీసుకుని ఎవరూ పట్టించుకోలేదు.

మూడు నెలల ముందే శవపేటిక సిద్ధం..

తన మరణానికి మూడు నెలల ముందే శవపేటిక తయారు చేయించుకున్నారు. మరణానికి భయపడటంపోయి ప్రశాంతంగా తన మరణానికి ఏర్పాట్లు చేసుకున్నారు. 1945 జనవరి 6వ తేదీన మానికొండ వెళ్లి ఆయన జ్వరంతో తిరిగి వచ్చారు. సరైన అన్నపానాలు లేకుండా కఠిన ఉపవాసాలు చేస్తూ కూలి చేసుకుంటూ చివరకు మంచం పట్టే దశకు చేరాడు. జనవరి 14వ తేదీకి ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది. ఆయన చెప్పిన జనవరి 15వ తేదీ రానే వచ్చింది. తంబి మరణించే రోజు అని తెలుసుకుని చాలా మంది గుడి వద్ద గుమిగూడారు. కానీ ఆయన బోయపాటి కుటుంబం ఇంటి వద్ద ఉన్నారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు బోయపాటి కుటుంబ సభ్యులు ఉండగా తుది శ్వాస విడిచారు. తంబి మరణించి 78 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అన్ని మతాలు, కులాలు వారు వివిధ రాష్ట్రాల ప్రాంతాల నుంచి నిత్యం ఆయన సమాధిని దర్శించుకుంటున్నారు.

13వ తేదీ నుంచి..

ప్రతి ఏటా జనవరి 13, 14,15, తేదీల్లో లక్షల సంఖ్యలో యాత్రికులు వస్తుంటారు. పెద అవుటపల్లి బ్రదర్ జోసఫ్ తంబిగా పేరొందిన ఈయనకు 2007లో జూన్ 24న దైవసేవకుడు బిరుదుతో వాటికన్(తిరుసభ) సత్కరించింది. ప్రస్తుత సమాజానికి ఒక సవాలుగా నిలిచిన తంబి జీవనశైలిని, నవ చైతన్య సమాజా నిర్మానానికి సాక్ష్యంగా ఆదర్శంగా తీసుకోవాలని కథోలిక సంఘం ఆశిస్తుంది.

మహోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు

బ్రదర్ జోసఫ్ తంబి మహోత్సవాలకు విచ్చేసే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశాం. భద్రతా పరంగా పోలీసులు, ఫైర్, వైద్య సదుపాయాలు ఆయా శాఖల ద్వారా సేవలు లభిస్తాయి. పంచాయితీవారు ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపడుతారు. మహోత్సవాలు మూడు రోజులు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు చర్యలు తీసుకున్నాం.

–తంబి పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్ నున్నం

శవరాజకీయాలు మానుకోవాలి

వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉయ్యూరు: టీడీపీ మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శవ రాజకీయాలు మానుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. మండలంలోని కాటూరు గ్రామంలో ప్రమాదవశాత్తు బాలుడు చెరువులో పడి మృతి చెందిన సంఘటనను టీడీపీ రాజకీయం చేయటం హేయమని దుయ్యబట్టారు. గ్రామంలో ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ చెరువులో పడి బాలుడు మృతి చెందటాన్ని బోడె రాజకీయం చేయటం దివాళాకోరు రాజకీయానికి నిదర్శనమన్నారు. జనాన్ని చంపే దుర్మార్గమైన చరిత్ర టీడీపీదన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో బోడె చరిత్ర, రాష్ట్రంలో చంద్రబాబు చరిత్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. కాటూరు గ్రామంలో కులాల మధ్య చిచ్చు పెట్టేలా టీడీపీ వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దాసే రవి, సర్పంచ్‌లు కొడాలి ఆశాజ్యోతి, పానుగుమాటి బాలస్వామి, తుమ్మూరు సురేష్‌రెడ్డి, నాయకులు కొలుసు పోతురాజు, మొవ్వా జ్ఞానశేఖర్, గారపాటి నాని, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చైతన్య స్ఫూర్తి యాత్ర



ర్యాలీలో పాల్గొన్న స్ఫూర్తి కుటుంబ సభ్యులు

గన్నవరం: స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఆధ్యాత్మిక విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి ఆశీస్సులతో విశ్వమానవ చైతన్య స్ఫూర్తియాత్రను వైభవంగా నిర్వహించారు. తొలుత ధవళ వస్త్రాలను ధరించిన కుటుంబ సభ్యులు విశ్వస్ఫూర్తి చిత్రపటాలతో ఊరేగింపుగా సభ ప్రాంగణానికి చేరుకున్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ..మనిషి సన్మార్గంలో నడిచేందుకు అవసరమైన ఆధ్యాత్మిక విషయాలను గురు విశ్వస్ఫూర్తి సమాజానికి అందించారని చెప్పారు. శాస్త్ర సాంకేతికతను ఆధ్యాత్మికతకు రంగరించి ప్రాక్టికల్ ఫిలాసఫర్గా ప్రసిద్ధి చెందిన గురు విశ్వస్ఫూర్తి ఆదర్శనీయులని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేఏస్.జగదీశ్వరరావు పేర్కొన్నారు. విశ్రాంత ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ముక్కామల సుబ్బారావు, హైస్కూల్ ప్రిన్సిపాల్ మాధవీలత, స్ఫూర్తి కుటుంబ సభ్యులు బానుకృష్ణ, నారాయణరావు, రాఘవరావు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాక్సింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



బాక్సింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కంకిపాడు: జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఈడుపుగల్లు నలంద విద్యార్థులు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి ఆదివారం అభినందించారు. ఆమె మాట్లాడుతూ క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ఆదివారం నిర్వహించారన్నారు. పోటీల్లో సబ్‌జూనియర్స్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు రాణించారన్నారు. బాలుర విభాగంలో 38–41 కేజీల కేటగిరీలో ధనుష్, 44–47 కేజీల కేటగిరీలో ఎస్.సాత్విక్, 51–54 కేజీల విభాగంలో ఎం.జస్వంతం, 54–58 కేజీల విభాగంలో డి.కిరణ్‌తేజ, 58–62 కేజీల విభాగంలో డి.రోహిత్, 56–62 కేజీల విభాగంలో ధీరజ్ మొదటి స్థానాన్ని కై వసం చేసుకున్నారన్నారు. బాలికల విభాగంలో 32–35 కేజీల కేటగిరీలో ఎం.స్తుతి, 50–53 కేటగిరీలో కె.హాసిని, 53–56 కేజీల కేటగిరీలో ఎంకే షఫియా మొదటి స్థానాన్ని సాధించారన్నారు. విద్యార్థులు ఆసక్తి చూపిన రంగాల్లో అవసరమైన శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపాల్ పద్మావతి వివరించారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూపు-1 పరీక్ష



పరీక్షా కేంద్రం వద్ద అధికారులు



తనిఖీ చేస్తున్న ఆర్‌డీఓ విజయ్‌కుమార్

పెనమలూరు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష ఆదివారం మండల పరిధిలో ప్రశాంతంగా జరిగింది. తహసీల్దార్ టీవీ.సతీష్ వివరాలు తెలుపుతూ మండలంలో సిద్ధార్థ లా కాలేజీ, ఎస్.ఆర్ జూనియర్ కాలేజీ పరీక్షా క్షేంద్రాల్లో 540 మంది పరీక్ష రాయటానికి ఏర్పాట్లు చేశామన్నారు. అయితే సిద్ధార్థ లా కాలేజీ పరీక్షా కేంద్రంలో 300 మందికి 191 మంది. ఎస్‌ఆర్.జూనియర్ కాలేజీలో 240 మందికి గాను 155 మంది పరీక్ష రాశారని సతీష్ తెలిపారు. ఉదయం, సాయంత్రం జరిగిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష సమర్థవంతంగా నిర్వహించామని అన్నారు.

కంకిపాడు: ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని పునాదిపాడు శ్రీచైతన్య విద్యా సంస్థల్లోని శ్రీపాద క్యాంపస్‌లో గ్రూప్–1 పరీక్షలు నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పేపర్లకు గానూ 367 మంది అభ్యర్థులకు 156 మంది మాత్రమే హాజరయ్యారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. లైజన్ ఆఫీసర్‌గా పశుసంవర్థకశాఖ జేడీ కె.చంద్రశేఖర్ వ్యవహరించారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ టీవీ సతీష్ తెలిపారు. పరీక్షల నిర్వహణను డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సీఐ పరమేశ్వరరావు, ఎస్‌ఐ దుర్గారావు, వీఆర్‌ఓలు పర్యవేక్షించారు.

ఉయ్యూరు: గ్రూప్ 1 ప్రిలిమ్స్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఆదివారం పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు. ఏజీఅండ్‌ఎస్‌జి సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన పరీక్షా కేంద్రానికి 480 మంది అభ్యర్థులకు 240 మంది హాజరయ్యారు. విశ్వశాంతి విద్యాసంస్థల్లో నిర్వహించిన పరీక్షా కేంద్రానికి 240 మంది అభ్యర్థులకు 137 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను ఉయ్యూరు ఆర్‌డీఓ విజయ్‌కుమార్, డీఎల్‌డీఓ నాంచారరావు, తనిఖీ చేశారు. కంకిపాడు సీఐ పరమేశ్వర్, ఎస్‌ఐ వీరప్రసాద్ బందోబస్తు చర్యలు పర్యవేక్షించారు.

చీటింగ్ కేసు నమోదు

పెనమలూరు: కారు అమ్మి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం చీటింగ్ కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ మొగల్రాజపురానికి చెందిన పత్రి శ్రీనివాస్ అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. అతను రెండు నెలల క్రితం కిరణ్ అనే వ్యక్తి వద్ద కారు కొనుగోలు చేశాడు. కానూరులో బంధువుల ఇంటి వద్ద పార్కింగ్ చేశాడు. అయితే గత నెల 26వ తేదీన కిషోర్ కారును తిరిగి తీసుకు వెళ్లాడు. తన కారు తనకు ఇవ్వాలని కోరగా రూ.7 లక్షలు చెల్లించాలని బెదిరించటంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

విద్యుత్ వైర్ల చోరీ

పెనమలూరు: కానూరు సనత్‌నగర్‌లో విద్యుత్ వైర్లు చోరీ చేసిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్ పంటకాలువ రోడ్డులో సోము మహేశ్వరరావు భవనం నిర్మించుకుంటున్నాడు. అయితే భవనంలో ఉన్న సుమారు రూ.50 వేలు విలువచేసే విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనపై మహేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

దుకాణంలో సరుకులు చోరీ

పెనమలూరు: తాడిగడపలో చోరీ జరగటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గ్రామంలో శ్రీనివాసనగర్ కట్ట వద్ద పి.వెంకటేశ్వరరావు బడ్డీ కొట్టు నిర్వహిస్తున్నాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం బడ్డీ కొట్టు తాళం పగులకొట్టి కొట్టులో ఉన్న రూ.20 వేలు విలువ చేసే సరుకులు చోరీ చేశారు. ఈ ఘటనపై షాపు యజమాని వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం..యనమలకుదురు విశ్వశాంతి నగర్‌కు చెందిన పి.అరుణ గత పది సంవత్సరాల క్రితం విజయ్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త కాంట్రాక్టర్‌గా పని చేస్తాడు. అయితే పెళ్లి సందర్భంగా ఇచ్చిన కట్నకానుకలు చాలలేదని భర్త, అత్త కురణమ్మ, మామ కుమార్ వేధించటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

క్రీస్తు ప్రేమతో జీవించాలి



దివ్యపూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్లు

ఉంగుటూరు: కుటుంబాలు సమాజానికి మూల స్థంబాలని, ప్రతి కుటుంబం క్రీస్తు ప్రేమతో జీవించాలని ఏలూరు మేత్రాసనం, మల్లికుంట విచారణ ఫాదర్ రుంజల జోసఫ్ తంబి అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్‌తంబి 78వ వర్ధంతి మహోత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు ఆదివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మత గురువుల ప్రత్యేక దివ్య పూజాబలిని సమర్పించారు. క్రైస్తవ కుటుంబ జీవితం గురించి బోధించారు. ప్రత్యేకంగా కుటుంబాల ఐక్యత గురించి ప్రార్థించారు. తంబి పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్ విన్నపాలను చదివి ప్రార్థనలు చేయాలని సూచించారు. అనంతరం ఫాదర్ ప్రవీణ్ గోపు గురు పట్టా వార్షికోత్సవం సందర్భంగా పలువురు గురువులు, విశ్వాసులు ఫాదర్‌ను సన్మానించి అభినందించారు. విచారణ ఫాదర్ మరియన్న, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



ఇందుపల్లిలో సమస్య నమోదుచేసుకుంటున్న ఎమ్మెల్యే వంశీ

- ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్
- ఇందుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: పేదరిక నిర్మూలన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఇందుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సదర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించారు. పలువురు అనారోగ్య బాధితులు, వృద్ధులకు ఎమ్మెల్యే తన సొంత నిధులు ఆర్థిక సాయంగా అందజేశారు. స్థానిక ప్రజలు వివరించిన సమస్యలను సావధానంగా విన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాలుగు అంతర్గత రహదారులకు శంకుస్థాపన చేశారు. ప్రజా సమస్యలు పరిష్కార దిశగా గడప గడపకు మన ప్రభుత్వం కొనసాగుతోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా లబ్ధిని జమ చేస్తున్నామని వివరించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ విశ్వాసముందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి వెంకట లక్ష్మి, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఉంగుటూరు, తరిగొప్పల ఎంపీటీసీలు సింహాచలం, నటరాజన్, పార్టీ మండల అధ్యక్షుడు వింత శంకర్‌రెడ్డి, నాయకులు ఆట్లూరి శ్రీను, మురళీ, ప్రసాద్, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోఆర్‌డీ బాషా, కార్యదర్శి నర్రా ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

కేసరపల్లి(గన్నవరం): అన్ని రంగాల్లో నియోజకవర్గం వేగంగా వృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. కేసరపల్లిలో విజయలక్ష్మీ ఎస్టేట్ ప్రాంగణంలో హిమజా కన్‌స్ట్రక్షన్ నూతనంగా నిర్మిస్తున్న ఎలైట్ విష్టాస్ విల్లాస్ భూమిపూజ కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. బ్రోచర్‌ను ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, హిమజా కనస్ట్రక్షన్ ఛైర్మన్ చలసాని నాగసురేష్‌తో కలిసి ప్రారంభించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఎంపీటీసీ సభ్యులు కొంతి కిషోర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యతో సతమతం



నున్న గ్రామంలో ట్రాఫిక్..

నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలో తరుచుగా ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మామిడికాయల మార్కెట్‌కు వచ్చే వాహనాల కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గంటల తరబడి వాహనాలు ఇరుక్కు పోయి ప్రజలు నానా అవస్థలు పడేపరిస్థితి ఉంది. ఈ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు 2016వ సంవత్సరంలో ఆర్‌అండ్‌బీ రైతుల నుంచి భూలను కొనుగోలు చేసి బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కొంత మంది రైతులు అభ్యంతరం పెట్టడంతో కొంత జాప్యం జరిగింది. అయినప్పటికి విజయవాడ-నూజివీడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో నున్న మ్యాంగో మార్కెట్ నుంచి బైపాస్ రోడ్డును రూ.1050 కోట్లతో నిర్మించారు. భారీవాహనాలు, నాన్‌స్టాఫ్ ఆర్టీసీ బస్సులు గ్రామంలోకి రాకుండా నిర్మించిన రోడ్డు కొద్ది దూరం పాడైపోయింది. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. భారీ వాహనాలు, కాలేజీల బస్సులు గ్రామం లో నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రోడ్డుకు ఆర్‌అండ్‌బీ శాఖ వారు మరమ్మతులు నిర్వహించి బైపాస్ రోడ్డు పూర్తి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సందడి

క్షేమ సమాచారాలు, ఆత్మీయ పలకరింపులు



సెయింట్ జాన్స్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు



వీకేఆర్ కాలేజీలో విశ్రాంత అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల 1992-93 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కంకిపాడు: పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. 30 ఏళ్ల తర్వాత వారంతా ఒకచోట చేరారు. వారి సంతోషాలకు అవధుల్లేవు. ఆనందానికి హద్దుల్లేవు. ఆత్మీయ పలకరింపులు, అల్లర్లు, సంతోషాలకు ఈడుపుగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆదివారం వేదికయింది. స్థానిక జెడ్పీ పాఠశాలలో 1992–93 బ్యాచ్‌లో విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అంతా ఒకచోట చేరుకుని సంతోషంగా గడిపారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కలియతిరిగారు. స్నేహితులను ఆటపట్టించి, చేసిన అల్లరి జ్ఞప్తికి తెచ్చుకుని హాయిగా నవ్వుతూ సంబరం చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహంగా ముగిసింది. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఏఎస్ చౌదరి, గంధం, ఎం.శివకోటేశ్వరరావు, షేక్ పాష్యామ్యా, బీ.శరత్‌కుమార్, కొండవీటి ఇస్రాయేలు, కె.ప్రసాద్, డాక్టర్ కమల్ రాజేష్ తదితరులు పర్యవేక్షించారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారులో ఉన్న వీకేఆర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. కళాశాలలో విద్యనభ్యసించి దేశవిదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. తొలుత కళాశాల వ్యవస్థాపకులు వేములపల్లి కోదండరామయ్య, లక్ష్మీఅన్నపూర్ణమ్మ దంపతులు, తొలి ప్రిన్సిపాల్ తాతినేని శ్రీనివాసరావు చిత్రపటాలకు నివాళులర్పించారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ..ఈ ప్రాంత విద్యాభ్యున్నతికి వీకేఆర్ కళాశాల బాటలు వేసిందన్నారు. కళాశాల యాజ మాన్య కమిటీ అధ్యక్షుడు వెంకట్ మోటపర్తి మాట్లాడుతూ..విమానాశ్రయ విస్తరణ వల్ల ఒడిదుడుకులను అధిగమించి అత్యాధునిక వసతులతో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్. ప్రసాద్, నాదెండ్ల బాలమురళీకృష్ణ నేతృత్వంలో జరిగిన సమ్మేళనంలో మాజీ ప్రిన్సిపాల్ యు.స్వర్ణకుమారి, రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు, డాక్టర్ ఎం.విజయకుమార్, ఎం.ప్రభాకరచౌదరి, కె. ఆంజనేయప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ నేతలు కొత్తంగి శ్రీనివాసరావు, తాతినేని రవికుమార్, హేమసుందర్ పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో ఆదివారం పునీత మాంట్‌పోర్టు విద్యా సంస్థ హైదరాబాద్ ప్రావిన్స్‌లోని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సమ్మేళనంలో ప్రావిన్స్‌లోని 18 పాఠశాలల నుంచి 1978–79 బ్యాచ్‌కు చెందిన ఐదుగురు చొప్పున పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాల్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్ కుమార్ జ్యోతిప్రజ్వాలన చేసి ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ..ప్రతి విద్యార్థి పాఠశాల జీవితం మధురస్మృతులుగా నిలుస్తాయన్నారు. పాఠశాల నేర్పిన ప్రేమ–సేవాభావంతో సమాజాభివృద్ధిలో సాయం చే యాలని కోరారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కారించారు.